మార్వాడీ ఆయిమాత జయంతిలో జగ్గారెడ్డి



సంగారెడ్డి సమీపంలోని మల్కాపూర్ వద్ద నిర్వహించిన ఆయిమాత జయంతి వేడుకల్లో పాల్గొన్న జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి సమీపంలోని మల్కాపూర్ చింతల్‌లో ఉన్న మార్వాడీల ఆరాధ్య దైవమైన ఆయిమాత ఆలయంలో సోమవారం నాడు అట్టహాసంగా ఆయి మాత జయంతి వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఆయి మాత అమ్మవారికి జగ్గారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి మార్వాడీలు భక్తి శ్రద్ధలతో చేసిన జాగరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గారెడ్డి వెంట మార్వాడీ సంఘం నాయకులు రఘురాం, మోతీలాల్ సోలంకి, మోహన్, సునీల్ మిట్టల్, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే సహించేది లేదు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన సిద్దిపేట మున్సిపల్ కమిషనర్
- విచారణకు ఆదేశం
- చర్చనీయాంశంగా 'కమీషన్ కొట్టు, బిల్లు పట్టు' కథనం



సిద్దిపేట ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట మున్సిపల్‌లో ఉద్యోగులు, సిబ్బంది అవినీతికి పాల్పడితే సహించేది లేదని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ హెచ్చరించారు. సిద్దిపేట మున్సిపల్‌లోని ఇంజనీరింగ్ సెక్షన్‌లో జరుగుతున్న తతంగంపై సోమవారం ఆంధ్రజ్యోతి లో ప్రచురితమైన "కమీషన్ కొట్టు, బిల్లు పట్టు" కథనంపై ఆయన స్పందించారు. కాగా 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో, అటు కౌన్సిల్ సభ్యుల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు ఇంజనీరింగ్ సెక్షన్‌లోని పలువురు అధికారులు దీనిపై గుసగుసలాడుకున్నట్లు తెలిసింది. ప్రచురితమైన కథనంపై ఇంజనీరింగ్ సెక్షన్‌లో విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అవినీతి చేసినట్లు ఆరోపణలు రుజువు అయితే ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఇదే విషయమై సిద్దిపేట అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) గరీమాఅగ్రవాల్, ఆర్‌డీఎంఏ వరంగల్ అధికారులు సైతం ఆరా తీసినట్లు తెలిసింది.



చేర్యాల కస్తూర్బా విద్యాలయం

విషజ్వరాల బారిన విద్యార్థినులు

- కాలినడకన ఆస్పత్రికి..

చేర్యాల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చేర్యాలలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పలువురు విద్యార్థినులు విషజ్వరాల బారిన పడ్డారు. వాతావరణంలో మార్పుల కారణంగా నిత్యం పలువురు జ్వరాలతో పాటు అస్వస్థతకు గురవుతున్నారు. పట్టణానికి శివారున ఉన్నందున విద్యాలయంలోని సిబ్బందితో చికిత్స చేయిస్తున్నప్పటికీ అది పుకాకపోవడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయిస్తున్నారు. మొత్తం 250 మంది విద్యార్థులున్నారు. జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య క్రమక్రమంగా పెరుగుతుండటంతో కొందరిని ఇంటికి పంపించి వేస్తున్నారు. దీంతో తోటి విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

నడుచుకుంటూ వెళ్లాల్సిందే..

ఆరోగ్యపర సమస్యలు ఎదుర్కొంటున్న విద్యార్థులను కాలినడకన పట్టణ శివారు నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు తీసుకువస్తున్నారు. విద్యాలయంలోనే శిబిరం నిర్వహించకుండా, అస్వస్థతగా ఉన్న విద్యార్థులను కాలినడకన పంపిస్తుండటంతో ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై కస్తూర్బా ప్రతేకాధికారి కృష్ణవేణి మాట్లాడుతూ, ఇద్దరు, ముగ్గురే జ్వరాల బారిన పడటంతో ఆస్పత్రికి సిబ్బంది సంరక్షణలో కాలినడకన పంపిస్తున్నామని తెలిపారు.

వచ్చిరాని వైద్యంతో పరేషాన్!

- గ్రామాల్లో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆర్‌ఎంపీలు!
- కమీషన్లు ఇచ్చే ఆసుపత్రులకు పేషంట్ల రిఫర్
- 30 నుంచి 40 శాతం కమీషన్ల వసూలు
- తిమ్మాపూర్ ఘటనతో వెలుగుచూసిన కొందరి బాగోతం
- వైద్యారోగ్యశాఖ అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు



గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. పేదప్రజల అవగాహన లేమిని ఆసరాగా చేసుకుని, వచ్చి రాని వైద్యంతో కొందరు వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కేవలం ప్రాథమిక చికిత్సలు మాత్రమే చేయాల్సిన ఆర్‌ఎంపీలు... ఆపరేషన్లు మినహా మిగతా అన్ని రకాల వైద్య సేవలు అందిస్తూ రోగుల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నారు. కమీషన్లకు కక్కుర్తిపడి నకిలీ, శాంపిల్ మందులను రోగులకు ఇస్తున్నారు. ఇక పట్టణాల్లోని కార్పొరేట్ ఆసుపత్రులతో కుమ్మక్కై భారీ కమీషన్లు దండుకుంటున్నారు. తిమ్మాపూర్ ఘటనతో ఆర్‌ఎంపీల బాగోతం వెలుగులోకి వచ్చింది. వైద్యారోగ్య శాఖ అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గజ్వేల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):వాస్తవానికి ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. ఎలాంటి ఇంజెక్షన్లు ఇవ్వకూడదు. ఏదైనా జ్వరంతో వస్తే మాత్రమే ఇవ్వాల్సి ఉంటుంది. జ్వరం, ఇతరత్రా ఏదైనా తీవ్రత ఉంటే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సిఫారసు చేయాలి.



కానీ గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీలు ఏ రోగం వచ్చినా స్వయంగా ఇంజెక్షన్ ఇస్తున్నారు. యథేచ్ఛగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ వంటివి ఇస్తూ ప్రజల రోగ నిరోధక శక్తిపై ప్రభావాన్ని చూపుతున్నారు. ఒక్క మాత్రను కూడా తమ వద్ద నిల్వ ఉంచడానికి వీలు లేదు. కానీ మెడికల్ దుకాణానికి మించిన స్థాయిలో కొందరు ఆర్‌ఎంపీలు మందులు నిల్వ ఉంచుతున్నారు.

తిమ్మాపూర్ ఘటనతో వెలుగులోకి..

జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్‌లో ఇటీవల ఓ ఆర్ఎంపీ వైద్యుడి నిర్వాకంతోనే ప్రాణాలు పోయాయని అధికారులు గుర్తించారు. దీంతో జిల్లా కలెక్టర్ హైమావతి సదరు ఆర్ఎంపీ వైద్యశాలను సీజ్ చేయడంతో పాటు కేసు నమోదు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సైతం సదరు ఆర్‌ఎంపీ నిర్వహిస్తున్న వైద్యశాలపై దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వఉంచిన మందులను సీజ్ చేసి, కేసు నమోదు చేశారు.

కానరాని తనిఖీలు

గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీలు నిర్వహించే వైద్యశాలలపై నిరంతరం వైద్యాధికారులు తనిఖీలు చేయాల్సి ఉంటుంది. కానీ ఆర్‌ఎంపీలు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తి పడుతున్న వైద్యారోగ్య శాఖ అధికారులు తనిఖీలు చేపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రెండు నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక రాష్ట్ర వైద్యాధికారుల బృందం గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌తో పాటు డివిజన్ పరిధిలోని ఆర్‌ఎంపీలు నిర్వహించే వైద్యశాలలపై దాడులు నిర్వహించి, కేసులు నమోదు చేశారు. వైద్యశాలలను సీజ్ చేశారు. అనంతరం మామూళ్లు ముట్టడంతో యథావిధిగా

మిగతా 8వ పేజీలో



కొనసాగుతున్న ఎత్తిపోతలు

- రోజుకు 10 వేల క్యూసెక్కుల జలాలు
- రిజర్వాయర్‌లో ప్రస్తుతం 13 టీఎంసీలు నిల్వ

తొగుట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తొగుట మండలం తుక్కాపూర్ శివారులో 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లోకి గోదావరి జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 13 టీఎంసీల నీరునిల్వ ఉండగా సోమవారం ఎనిమిది పంపుల ద్వారా ఎత్తిపోతలను ఇరిగేషన్ అధికారులు ప్రారంభించారు. ప్రతిరోజూ 10వేల క్యూసెక్కు(0.85 టీఎంసీ)ల నీటిని ఎత్తిపోసి, ఈ ఏడాది గరిష్ఠంగా 30 టీఎంసీల నీటిని మల్లన్నసాగర్‌లో నిల్వ చేయనున్నట్లు డిప్యూటీ ఇంజనీరు చెన్ను శ్రీనివాస్‌రావు తెలిపారు.

జిల్లా అడిషనల్ డీసీపీగా కుశల్కర్



సిద్దిపేట క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా అడిషనల్ డీసీపీ (అడ్మిన్)గా సీహెచ్.కుశల్కర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సీపీ అనురాధను మర్యాదపూర్వకంగా కలిశారు. అడిషనల్ డీసీపీ కుశల్కర్ ఎస్ఐగా 1995లో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో చేరారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా లో పనిచేసి, 2008లో సీఐగా పదోన్నతి పొందారు. ఆ తర్వాత ఉమ్మడి నిజామాబాద్, హైదరాబాద్ సిటీలో పనిచేశారు. 2018లో ఏసీపీగా ప్రమోషన్ పొంది సీసీఎస్ హైదరాబాద్ సిటీ, షాద్‌నగర్, మహేశ్వరం ట్రాఫిక్ ఏసీపీగా పనిచేస్తూ అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందారు.



ఒక్క బస్తా కోసం

- తెల్లవారుజాము నుంచే పడిగాపులు
- పోలీస్ పహారాలో యూరియా పంపిణీ
- కొన్నిచోట్ల టోకెన్లు కూడా దక్కని దైన్యం
- ఆగ్రహంతో నిరసనలు, ఆందోళనలు

← దుబ్బాక వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

7

డంపింగ్ యార్డును తరలించాల్సిందే!

- బుస్సాపూర్ వాసుల ఆందోళన
- రోడ్డుపై బైఠాయించి చెత్త వాహనాల అడ్డగింత
- 15 రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తా
- మున్సిపల్ కమిషనర్ హామీ

6

కలెక్టర్ మేడమ్‌కే అర్జీలను అందిస్తాం

- ఇతర అధికారులున్నా వారికి ఇచ్చేందుకు అనాసక్తి
- ప్రజావాణికి మొత్తం 281 ఫిర్యాదులు

సిద్దిపేట ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో భాగంగా పలు సమస్యలపై అర్జీలను అందించేందుకు వస్తున్న వారు కలెక్టర్ హైమావతికే అధికసంఖ్యలో అందిస్తున్నారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు, డీఆర్వో, ఏవోలు కూడా ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. అయినా కూడా ప్రజలు ఇతర అధికారులకు తమ ఫిర్యాదులను అందించకుండా కలెక్టర్‌కే ఇచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. సాధారణంగా ప్రజావాణి ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహిస్తారు. అయితే అనేకమంది కలెక్టర్ ఇవ్వాలని మధ్యాహ్నం వరకు క్యూలో వేచి ఉంటున్నారు. మధ్యాహ్నం 1 తర్వాత మిగతా కార్యక్రమాల నేపథ్యంలో కలెక్టర్ హడావిడిగా ప్రజావాణి నుంచి వెళ్లిపోతుండడంతో అప్పటి వరకు క్యూలో ఉన్న కొందరు కలెక్టర్‌ను కలవలేక భంగపడుతున్నారు. క్యూలో ఉన్న అర్జీదారులు ప్రజావాణిలో ఇతర అధికారులకు అందించాలని పోలీసు సిబ్బంది, కలెక్టరేట్ సిబ్బంది సూచిస్తున్నప్పటికి, తాము మాత్రం కలెక్టర్‌కే ఇస్తామంటూ చెబుతున్నారు. ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం వివిధ సమస్యలపై 281 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

అడ్మిషన్లు కావాలంటూ విద్యార్థినుల వేడుకోలు

చేగుంట మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థినులు దుబ్బాక మండలం రామక్కపేట రెసిడెన్షియల్ పాఠశాలలో ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సంపాదించలేదు. దీంతో అడ్మిషన్లలో భాగంగా సీట్లు



ఇతర కార్యక్రమాల నిమిత్తం వెళ్లడానికి కలెక్టర్ హైమావతి సిద్ధమవడంతో ఆమె వద్ద గుమిగూడిన అర్జీదారులు

ఖాళీగా ఉన్నాయన్న విషయం తెలుసుకొని ముగ్గురు విద్యార్థినీలు వారి తల్లులతో కలిసి ప్రజావాణికి హాజరయ్యారు. ఈ మేరకు వినతిపత్రాన్ని డీఆర్వో నాగరాజమ్మకు అందించగా, డీఆర్వో కలెక్టర్ హైమావతి దృష్టికి తీసుకెళ్లారు. ఇద్దరికి 5వ తరగతిలో, ఒకరికి 7వ తరగతిలో అడ్మిషన్ ఇవ్వాలంటూ సంబంధిత అధికారులకు ప్రతిపాదించారు.

ఓపికతో వైద్యం చేయాలి

చిన్నకోడూరు: రాత్రి వేళలో ఆస్పత్రికి వచ్చే రోగులకు ఓపికతో వైద్యం చేయాలని కలెక్టర్ హైమావతి సూచించారు. చిన్నకోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. అటెండెన్స్, ఓపి రిజిస్టర్‌లను పరిశీలించారు. డ్యూటీ షిఫ్ట్ రిజిస్టర్ పెట్టుకోవాలని రోస్టర్ రిజిస్టర్‌ను తప్పనిసరిగా మెయింటైన్ చేయాలని చెప్పారు.



ఉత్సాహంగా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఆ సంఘం అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, డీవైఎస్‌వో వెంకట నర్సయ్య సోమవారం ప్రారంభించారు. అండర్ 14, 16, 18, 20 విభాగంలో బాలబాలికలకు రన్నింగ్, జంపింగ్, త్రో బాల్ తదితర పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కర్రోళ్ల వెంకటస్వామి గౌడ్, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడకంచి ఉప్పలయ్య, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

● జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి హేమలత

కౌడిపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, వృద్ధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జూనియర్ సివిల్ న్యాయాధికారి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్ హేమలత హెచ్చరించారు. శనివారం కౌడిపల్లి మండలం తునికిలోని డాక్టర్ డి.రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ఓల్డేజ్ హోంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నతనం నుంచి పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం సమాజానికి మంచిది కాదని ఆమె అన్నారు. అనంతరం ట్రస్టులో ఉంటున్న వృద్ధుల బాగోగులు, వారికి అందిస్తున్న ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ కృష్ణ, కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి, ట్రస్టు డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, ట్రస్టు నిర్వాహకులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తరలించాల్సిందే!

● బుస్సాపూర్ గ్రామస్థుల ఆందోళన
● రోడ్డుపై బైఠాయించి చెత్త వాహనాలను అడ్డుకున్న రైతులు
● 15 రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తా
● మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ హామీ


బుస్సాపూర్ గ్రామస్థులు,రైతులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్

సిద్దిపేట రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామం శివారులోని డంపింగ్ యార్డును వెంటనే తరలించాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట రూరల్ మండలం బుస్సాపూర్ గ్రామస్థులు, రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. డంపింగ్ యార్డుకు వెళ్లే రహదారిపై బైఠాయించి చెత్త వాహనాలను అడ్డుకున్నారు. డంపింగ్ యార్డులోని చెత్త దుర్వాసనతో భూగర్భ జలాలు కలుషితమై మూగజీవాలు, చేపలు మృత్యువాత పడుతున్నాయని, తమ పిల్లలు అనారోగ్యాల పాలవుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. 15 ఏళ్ల క్రితం గ్రామస్థులను నమ్మించి డంపింగ్‌యార్డును ఇక్కడ ఏర్పాటు చేశారని, ఇప్పుడు తమ జీవితాలను కాలుష్యం కోరల్లోకి నెట్టారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రి వ్యర్థాలను కూడా ఇక్కడే వేయడం వల్ల కుక్కలు వాటిని రోడ్లపైకి, పంట పొలాల్లోకి లాక్కొచ్చి భయంకర వాతావరణం సృష్టిస్తున్నాయని వాపోయారు. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, తహసీల్దార్ స్వామి, రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐ రాజేష్ సంఘటన స్థలానికి చేరుకుని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయితే డంపింగ్ యార్డు ఎప్పుడు తరలిస్తారో స్పష్టమైన హామీ ఇవ్వాలని గ్రామస్థులు పట్టుబట్టారు. డంపింగ్ యార్డు తరలింపు తన పరిధిలోని అంశం కాదని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి 15 రోజుల్లోగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. ఇదే విషయంపై బుస్సాపూర్, వరదరాజులపల్లి గ్రామస్థులు కొందరు కలెక్టరేట్ కార్యాలయం వద్ద కూడా నిరసన తెలియజేస్తూ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.



సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు

ఆశ వర్కర్ల ఆందోళన

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు అందించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్ డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరిచిన మేరకు వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత అమలుపరచడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై విచారణ?

● పలు ఆరోపణలు చేస్తూ మంత్రికి సిబ్బంది లేఖ
● స్పందించిన రాజనర్సింహ.. విచారణాధికారి నియామకం

గజ్వేల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై విచారణకు మంత్రి ఆదేశించినట్లు తెలిసింది. ఆస్పత్రి సిబ్బంది సూపరింటెండెంట్‌పై ఆరోపణలు చేస్తూ మంత్రి దామోదర రాజనర్సింహకు లేఖ రాయడంతో స్పందించిన ఆయన వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్‌ను విచారణాధికారిగా నియమించినట్లు తెలుస్తుంది. ఆస్పత్రి సూపరింటెండెంట్ గైనకాలజిస్టు కావడంతో ప్రతీ నెల ప్రసూతిల సంఖ్య తగ్గుతూ వస్తుందని, పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రితో కుమ్మక్కై నెలనెలా మామూళ్లు తీసుకుంటున్నారని లేఖలో ఆరోపించారు. గతంతో పోల్చితే నెలకు 55 డెలివరీలు తగ్గాయని, ఇందుకు సూపరింటెండెంట్ మామూళ్ల వసూలే కారణమని పేర్కొన్నారు. దాదాపుగా రూ.16లక్షలు ఇప్పటివరకు ప్రైవేటు ఆసుపత్రి వైద్యుల వద్ద పొందారని లేఖలో పేర్కొన్నారు. అంతేకాకుండా గర్భసంచి ఆపరేషన్ల విషయంలోనూ స్పష్టంగా కుమ్మక్కు కనబడుతుందని, 2024లో 45 గర్భసంచి(కు.ని.) ఆపరేషన్లు జరిగితే ఈ ఏడాది కేవలం రెండు జరిగాయని లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. సహకరించని సిబ్బందిని వేధిస్తున్నారని, ఈ క్రమంలో పలువురు వైద్యులు లాంగ్‌లీవ్‌లో వెళ్లివచ్చారని లేఖలో రాశారు. ఆస్పత్రిలో సదుపాయాలు లేవని సూపరింటెండెంట్ రోగులకు చెబుతూ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లేలా చేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుత సూపరిండెంట్ అన్నపూర్ణ వచ్చిన పిదపనే హైరిస్క్ కేంద్రాన్ని జిల్లా ఆసుపత్రి నుంచి మాతా శిశు సంరక్షణ ఆసుపత్రికి తరలించారని అందులో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

పటాన్‌చెరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ దుర్మరణం పాలైన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రారం గ్రామానికి చెందిన లక్ష్మి(47) సోమవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె రెండు కాళ్లు నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందారు. మృతురాలి అల్లుడు నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి గుంతలో పడి యువకుడి మృతి

చిన్నకోడూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన చిన్నకోడూరు మండలం పెద్దకోడూరులో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై సైఫ్ అలీ కథనం ప్రకారం.. పెద్దకోడూరుకు చెందిన అనరాసి లక్ష్మి, సత్తయ్య దంపతుల చిన్న కుమారుడు రాజు(22)కు పుట్టుకతోనే మానసిక స్థితి సరిగా లేదు. సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాజు ప్రమాదవశాత్తు స్థానిక ఎల్లమ్మ ఆలయం సమీపంలోని నీటి గుంతలో పడ్డాడు. గ్రామస్థులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి గ్రామస్థుల సాయంతో గుంతలో నుంచి బయటకు తీసి చూడగా, రాజు అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య

పటాన్‌చెరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవ పడిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తంగిలో నివాసం ఉంటున్న బసవరాజ్ (38) కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అతడికి మద్యం అలవాటు ఉండటంతో భార్య మమతతో నిత్యం గొడవలు జరిగేవి. ఆదివారం రాత్రి భార్యను కొట్టడంతో ఆమె మనస్తాపానికి గురై ఇస్నాపూర్‌లో ఉన్న తన అక్క ఇంటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన బసవరాజ్ సోమవారం ఉదయం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తమ్ముడు అంబాదాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పుస్తెలతాడు దొంగ అరెస్ట్, రిమాండ్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలోని ఓడీఎఫ్ కాలనీ ద్వారకా నగర్‌లో ఆదివారం ఓ వృద్ధురాలిని బెదిరించి 5 తులాల బంగారు పుస్తెలతాడు దోచుకుపోయిన దొంగను పోలీసులు పట్టుకున్నారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ సోమవారం వివరాలు వెల్లడించారు. ద్వారకానగర్‌కు చెందిన సండ హంసమ్మ ఆదివారం ఉదయం 6.30 గంటల సమయంలో తన ఇల్లు ఊడుస్తుండగా ఓ వ్యక్తి ముఖానికి మాస్క్ ధరించి, వృద్ధురాలి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి బలవంతంగా మెడలోంచి రెండు వరుసల 5 తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని పారిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నాలుగు బృందాలుగా ఏర్పడి గాలించారు. నిందితుడు ఉపయోగించిన బైక్ ఆధారంగా సంగారెడ్డిలోని వసంతనగర్ కాలనీలో ఉంటున్న కౌకుంట్ల ప్రభాకర్‌గా గుర్తించి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ రమేశ్ తదితరులు ఉన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● నిజాంపేటలో ఎనిమిది మంది అరెస్ట్

నిజాంపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడి చేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.15,040 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, ఐదు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని నగరం తండా శివారులో సోమవారం అందిన సమాచారం మేరకు ఎస్.ఐ రాజేష్ ఆధ్వర్యంలో ఈ దాడి జరిగింది. గత పదిహేను రోజుల క్రితం కూడా కల్వకుంట్ల, రజాక్‌పల్లి గ్రామాల్లో దాడులు చేసినప్పటికీ ఆగడం లేదు

అంగన్‌వాడీ కోడిగుడ్లలో పురుగులు


కోనాపూర్ అంగన్‌వాడీ సెంటర్‌లో కోడిగుడ్డులో బయట పడ్డ పురుగులు

దౌల్తాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం కోనాపూర్ గ్రామ అంగన్‌వాడీ సెంటర్ ద్వారా పంపిణీ చేసిన కోడిగుడ్లలో పురుగులు బయట పడ్డాయి. ఆదివారం గ్రామానికి చెందిన ఓ బాలింత అంగన్‌వాడీ నుంచి తెచ్చిన ఎనిమిది కోడిగుడ్లలో ఒక గుడ్డులో చిన్న పురుగులు కనిపించడంతో కంగుతింది. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పంపిణీ చేసే పౌష్టికాహారం ఇలా ఉంటే ఎలా అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.




మెదక్ జిల్లా నిజాంపేట మండలం కల్వకుంటలో, రామాయంపేట మండలం కోనాపూర్‌లో రైతుల అవస్థలు

ఒక్క బస్తా కోసం...

తెల్లవారుజాము నుంచే పడిగాపులు

పోలీస్ పహారాలో యూరియా పంపిణీ

కొన్నిచోట్ల టోకెన్లు కూడా దక్కని దైన్యం

ఆగ్రహంతో నిరసనలు, ఆందోళనలు



హవేళిఘణపూర్‌లో వినాయకుడి విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి.



దుబ్బాక సహకార సంఘం వద్ద రాత్రి నుంచే వేచిఉన్న రైతులు

సిద్దిపేట రూరల్/చిన్నకోడూరు/కుకునూరుపల్లి/మిరుదొడ్డి/చేర్యాల/మద్దూరు/బెజ్జంకి/దుబ్బాక/హవేళిఘణపూర్/మనోహరాబాద్/శివ్వంపేట/చేగుంట/రామాయంపేట/నిజాంపేట/తూప్రాన్/హత్నూర, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో సోమవారం సైతం రైతులకు యూరియా కష్టాలు తప్పలేదు. రైతులు వేకువ జాము నుంచే రైతు వేదికలు, ఎరువుల దుకాణాల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్నిచోట్ల టోకెన్లు కూడా అందక రైతులు నిరసనలు చేపట్టారు. ఒక పాస్‌బుక్‌కు ఒకే బస్తా ఇవ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పీఏసీఎస్‌ల వద్ద పోలీస్ పహారాలో ఎరువు బస్తాలను పంపిణీ చేశారు.

పరిస్థితి ఇలా..

● సిద్దిపేట రూరల్ పరిధిలోని పుల్లూరు, బండచేర్లపల్లి రైతు వేదికల వద్ద యూరియా కోసం గంటల తరబడి నిరీక్షించగా, పాస్‌బుక్‌కు ఒక్క బస్తా మాత్రమే ఇచ్చారు.

● చిన్నకోడూరు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి, అల్లీపూర్ సొసైటీకి 560 బస్తాల చొప్పున యూరియా వచ్చింది. చిన్నకోడూరులో రైతు వేదిక వద్ద టోకెన్‌ల కోసం రైతులు గంటల తరబడి వేచి ఉన్నారు. కొంతమందికి టోకెన్‌లు రాకపోవడంతో అధికారులతో వాగ్వాదానికి దిగారు. తహసీల్దార్, ఎస్‌ఐ జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

● మిరుదొడ్డిలో యూరియా రాకపోవడంతో ఆగ్రహించిన రైతులు రైతువేదిక వద్ద ప్రధాన రహదారిపై సుమారు గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. పంట దిగుబడిపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌ఐ సమతా సిబ్బందితో అక్కడికి చేరుకుని రైతులను సముదాయించారు. అయిన రైతులు వినకపోవడంతో గంటపాటు వాహనాలు నిలిచిపోయాయి.

● కుకునూరుపల్లి మండలానికి 25 టన్నుల యూరియా అందుబాటులోకి రాగా టోకెన్ విధానం ద్వారా పోలీసు పహారాలో రైతులకు అందజేశారు. మరింత యూరియా కోసం ఇండెంట్ పంపామని వ్యవసాయ అధికారులు తెలిపారు.

● చేర్యాలలో యూరియా కొరతపై తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు వేదిక వద్ద ఆందోళన చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని నాయకులు ఆరోపించారు. చేర్యాల పీఏసీఎస్ సొసైటీ ఆధ్వర్యంలో యూరియాను పంపిణీ చేశారు. రైతులు ఆరుబయట బారులు తీరకుండా రైతువేదికలో కూర్చొబెట్టి వరుస క్రమంలో పోలీస్ బందోబస్తు మధ్య టోకెన్లను అందజేశారు. రెండు ఎకరాలలోపు రైతులకు ఒక బస్తా, అంతకుమించి ఉన్నవారికి రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు.

● హవేళిఘణపూర్‌లో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి వినాయకుడి విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతులకు ఎరువులను అందించేలా గణనాథుడు బుద్ధిచెప్పాలని వేడుకున్నారు.

● దుబ్బాక వ్యవసాయ సహకార సంఘానికి యూరియా లారీలు వస్తున్నాయనే సమాచారంతో రైతులు ఆదివారం రాత్రి నుంచే దుప్పట్లు తెచ్చుకుని పడిగాపులు కాచారు. అరుగుల మీద పడుకుని, తెల్లవార్లు జాగరణ చేశారు. సోమవారం ఉదయం 550 బస్తాల యూరియా రాగా, దాదాపు 2వేల మంది రైతులు చేరుకున్నారు. ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు తాము పడిగాపులు కాచినందుకైనా రేపటి స్టాక్ కోసం టోకెన్‌లను అందించాలని డిమాండ్ చేశారు. దుబ్బాక ఎస్‌ఐ కీర్తిరాజు రైతులను సముదాయించారు.

● మద్దూరు మండలంలోని రేబర్తి సొసైటీ వద్ద యూరియా పంపిణీ కోసం పోలీసులు పహారా ఏర్పాటు చేశారు. ఆధార్, పాస్‌పుస్తకాల ఆధారంగా 245 మంది రైతులకు 560 బస్తాలను పంపిణీ చేశారు.

● బెజ్జంకి పీఏసీఎస్ కార్యాలయం వద్ద తెల్లవారు జాము నుంచే రైతులు క్యూ కట్టారు. భూ విస్తీర్ణం ఆధారంగా ఒకటి లేదా రెండు బస్తాలు పంపిణీ చేయగా, చాలామందికి యూరియా దొరకలేదు.

● మనోహరాబాద్ మండలంలోని గొల్లగడ్డ వద్ద ఉన్న ఎరువుల దుకాణానికి 350 బస్తాలు రాగా, పోలీసులు, వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో లారీ నుంచే నేరుగా రైతులకు పంపిణీ చేశారు. ఇవి కొంతమందికి మాత్రమే సరిపోగా, మిగతా రైతులు వెనుదిరిగారు.

● శివ్వంపేట మండలంలోని పీఏసీఎస్ కార్యాలయం ముందు జాతీయ రహదారిపై తెల్లవారు జాము నుంచే రైతులు వరుసలో నిలబడ్డారు. 40 టన్నుల యూరియా పంపిణీ చేయగా, సుమారు 50 మంది రైతులు నిరాశతో వెనుదిరిగారు.

● చేగుంటలో తెల్లవారుజాము నుంచే రైతులు పడిగాపులు కాశారు. యూరియా కోసం రైతు వేదిక వద్ద ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్యూలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

● రామాయంపేట మండల పరిధి కోనాపూర్‌లో యూరియా కోసం రైతులు అరగంట పాటు రాస్తారోకో చేశారు. సొసైటీ వద్ద బస్తాల కోసం భారీ సంఖ్యలో గుమిగూడారు.

● నిజాంపేటలోని కల్వకుంట్ల గ్రామ పీఏసీఎస్ వద్ద రైతులు యూరియా కోసం తెల్లవారుజాము నుంచే బారులు తీరారు.

● తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లి రైతు వేదిక వద్ద టోకెన్ల కోసం రైతులు ఇక్కడికి ఉదయం 5 గంటలకే విచ్చేసి చెప్పులను లైన్‌లో పెట్టారు. తూప్రాన్ రైతు వేదికలో చెప్పుల క్యూలైన్లు కట్టిన రైతులు అక్కడ టోకెన్లు ఇవ్వడం లేదని తెలియడంతో గుండ్రెడ్డిపల్లికి వెళ్లిపోయారు.

● హత్నూరలో పీఏసీఎస్ వద్ద యూరియా కోసం పెద్ద సంఖ్యలో రైతులు గుమిగూడగా, కొంతమందికి మాత్రమే సరఫరా అందడంతో ఆందోళనకు దిగారు.

బయో మందులు తీసుకుంటేనే యూరియా

● **రైతులకు అంటగడుతున్న కొందరు ఫర్టిలైజర్ షాపు యజమానులు**

టేక్మాల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో పది ఫర్టిలైజర్ షాపులున్నాయి. యూరియా కావాలంటే అధిక ధర చెల్లించడంతో పాటు బయో మందులు కొనుగోలు చేయాల్సిందేనంటూ యజమానులు ఇబ్బందులు పెడుతున్నారని పలువురు రైతులు తెలిపారు. బయో మందుల విక్రయానికి ప్రభుత్వ అనుమతి ఉన్నప్పటికి వ్యాపారులు తమ స్వలాభం కోసం అవసరం లేకున్నా కొనాలని ఒత్తిడి తీసుకురావడంపై రైతులు మండిపడుతున్నారు. కొందరు అధికారుల అండతోనే రైతులను మోసం చేస్తున్నట్లు విమర్శలున్నాయి. ఆగ్రోస్, డీసీఎంఎస్ షాపుల్లోను బలవంతంగా బయో మందులు అమ్ముతున్నట్లు వినికిడి. కొందరు డీలర్లు ఏకంగా తాము సూచించిన బయో మందులు కొనుగోలు చేస్తేనే యూరియా బస్తాలు ఇస్తాం లేకుంటే ఒక్క బస్తా ఇవ్వం ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ దబాయిస్తున్నారని రైతుల వాపోతున్నారు. దుకాణ యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

బలవంతంగా కొనిపించడం తగదు

రైతులకు అవసరం లేని బయో మందులు బలవంతంగా కొనిపించడం తగదు. పీఏసీఎస్‌లలోనే యూరియా నిల్వలు ఉంచేలా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. అధిక ధరలు, అవసరం లేని వాటిని కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్న వారిపై రైతులు ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారుల అనుమతితో చర్యలు తీసుకుంటాం.

- మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్



మిరుదొడ్డిలో రాస్తారోకో చేస్తున్న రైతులు



చేర్యాలలో ఆందోళన చేస్తున్న ఏఐకేఎస్ నాయకులు



మద్దూరు మండలం రేబర్తిలో పోలీస్ పహారా



చిన్నకోడూరులోని అల్లీపూర్ సొసైటీ వద్ద..



శివ్వంపేట పీఏసీఎస్ కార్యాలయం వద్ద క్యూ



మనోహరాబాద్ గొల్లగడ్డలో లారీ నుంచి పంపిణీ చేస్తున్న యూరియా బస్తాలు

మల్లన్న సన్నిధిలో రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ ప్రత్యేక పూజలు



పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకుంటున్న ఎంపీ, ఆయన కుటుంబసభ్యులు

కొమురవెల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న ఆలయాన్ని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ సందర్శించారు. సోమవారం ఆయన కుటుంబసమేతంగా ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో పట్నాలు వేసి, బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొమురవెల్లి ఆలయాన్ని ప్రసాద్ పథకంలో చేర్చాలని, భక్తుల కోసం గదుల నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఆలయ ఈవో అన్నపూర్ణ ఎంపీ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్, రాష్ట్ర నాయకులు దూది శ్రీకాంత్‌రెడ్డి, మండల అధ్యక్షురాలు స్వరూప, తదితర నాయకులు ఉన్నారు.

సమానత్వమే సనాతన ధర్మం

● **వీహెచ్‌పీ జాతీయ కార్యదర్శి రావత్**

● **తొగుటలో 151 మంది దళిత మాతృమూర్తులకు పాదపూజ**



మాట్లాడుతున్న విశ్వహిందు పరిషత్ జాతీయ కార్యదర్శి రావత్

తొగుట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సమానత్వమే సనాతన ధర్మమని విశ్వ హిందూ పరిషత్ జాతీయ కార్యదర్శి రావత్ అన్నారు. సోమవారం తొగుట మండలం తుక్కాపూర్ గ్రామంలో జరిగిన సుహాసిని పాద పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హిందుత్వంలో అందరూ కలిసిమెలిసి అన్నదమ్ముల వలె జీవించాలని సూచించారు. ఈ సందర్భంగా తొగుట మండలంలోని 151 మంది దళిత మాతృమూర్తులకు పాదపూజ చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్‌స్వామీజీ, అంబికా శివయోగిస్వామిజీ, విశ్వత్మానందగిరిస్వామీజీ, వీహెచ్‌పీ నాయకులు మోహన్‌రావు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు సిద్దిపేట విద్యార్థులు ఎంపిక

సిద్దిపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని పూణేలో జరగనున్న జాతీయస్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య అండర్-15 బాలబాలికల వాలీబాల్ పోటీలకు సిద్దిపేట వాలీబాల్ అకాడమీకి చెందిన ఇద్దరు క్రీడాకారులు దుంపల శృతిక, వినయ్ వర్మ ఎంపికయ్యారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి వీరు జాతీయ స్థాయికి అర్హత సాధించినట్లు జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి వెంకట నరసయ్య తెలిపారు. కోచ్‌లు వీరారెడ్డి, ఈశ్వర్‌లను ఆయన అభినందించారు.

8 గంటల కరెంట్ కూడా ఇవ్వట్లేదు

విద్యుత్ కోతలతో రైతుల ఆందోళన

రేగోడ్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన అన్నదాతలు

రేగోడ్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కోతలతో వరి పంటలు ఎండిపోతున్నాయని రేగోడ్ మండలంలోని చౌదర్‌పల్లి, కొత్తపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం వారు రేగోడ్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం వ్యవసాయానికి 18 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతున్నా, కనీసం 8 గంటలు కూడా కరెంట్ ఇవ్వడం లేదని రైతులు మండిపడ్డారు. పక్కనే ఉన్న సంగారెడ్డి జిల్లాలో 18 గంటల పాటు విద్యుత్ సరఫరా అవుతోందని, తమకు మాత్రం అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇష్టానుసారంగా కరెంటు ఇస్తున్నారని ఆరోపించారు. తరచుగా విద్యుత్ ట్రిప్ అవడంతో బోరు మోటార్లు కూడా కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ పోచయ్య సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. విద్యుత్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సమస్య పరిష్కారం కాకపోతే మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా కలెక్టర్‌ను కలుస్తామని రైతులు తెలిపారు.



రేగోడ్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

ప్రజావాణి వినతులు పెండింగ్‌లో పెట్టొద్దు

● **మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్**

మెదక్ అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చే అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా వాటిని వెంటనే పరిష్కరించాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, అర్జీదారులు తరలివచ్చారు. కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణికి మొత్తం 96 అర్జీలు అందాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో భుజంగరావు, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అధికారులు డబ్బులు అడగకుండా చర్యలు తీసుకోవాలని హనుమన్ సుతార్తి సంఘం ఆధ్వర్యంలో ప్రజావాణిలో అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతి పత్రం అందజేశారు. 'మన ఊరు-మన బడిలో భాగంగా అప్పులు చేసి పనులు చేశామని, బిల్లుల కోసం మంత్రికి వినతి చేసేందుకు వెళ్లితే కేసులు పెట్టారని మాజీ ఎస్ఎంసీ చైర్మన్ సాయిలు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రావాల్సి బిల్లులు ఇప్పించాలని ప్రజావాణితో వినతి పత్రం అందజేశారు.



అర్జీదారు సమస్యను అడిగి తెలుసుకుంటున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

పోలీసు ప్రజావాణికి 12 ఫిర్యాదులు

మెదక్ అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణిలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి 12 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

అధికారులతో సమీక్ష

మెదక్ జిల్లా అధికారులతో కలెక్టర్ రాహుల్‌రాజ్ కలెక్టరేట్‌లో సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కారుణ్య నియామకాల విషయంలో అవసరమైన చెక్ లిస్ట్ తయారు చేసుకొని నిబంధనలు పాటిస్తూ.. భర్తీకి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు రుచి, పరిశుభ్రమైన ఆహారం అందించాలని సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నూతన అంగన్‌వాడీ భవనాల సముదాయాల నిర్మాణ ప్రక్రియ ప్రారంభించేలా చూడాలన్నారు.

వినతులు స్వీకరించిన సంగారెడ్డి కలెక్టర్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 35 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్‌వో పద్మజరాణిలకు అర్జీలు సమర్పించారు. డీఎంహెచ్‌వో పరిధిలో 117 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గుండయ్య, కార్యదర్శి భాస్కర్‌రావు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

జేఎన్టీయూ కళాశాల ఆస్తిపన్ను చెల్లించడం లేదు

పుల్‌కల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆస్తిపన్ను చెల్లించడం లేదని కోర్పోలు గ్రామానికి చెందిన యువకులు ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి వెళ్లిన వారు ఈ మేరకు కలెక్టర్ ప్రావీణ్యకు వినపతి పత్రం అందజేశారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో అర్జీలు అందజేస్తున్న ఫిర్యాదుదారులు

కేతకీ హుండీ ఆదాయం రూ.34.88 లక్షలు

ఝరాసంగం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీకేతకీ సంగమేశ్వర స్వామి వారి ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. గత 32 రోజులకు గాను ఆలయానికి రూ.34,88,120 ఆదాయం వచ్చినట్లు ఈవో శివరుద్రప్ప తెలిపారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గజ్వేల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ డివిజన్ పరిధిలోని ఆయా గ్రామాల్లో ఈ నెల 26న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ డీఈ ఆర్. భానుప్రకాశ్ తెలిపారు. 132/32కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు గజ్వేల్ మండల పరిధిలోని బంగ్లావెంకటాపూర్, అహ్మదీపూర్, ధర్మారెడ్డిపల్లి, సింగాటం, బెజుగామ, వర్గల్ మండల పరిధిలోని మజీద్‌పల్లి, నెంటూరు, రాయపోల్ మండల పరిధిలోని బేగంపేట సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

భరోసా ఫౌండేషన్ ఆర్థిక సాయం

గజ్వేల్ రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సింగాటం గ్రామానికి చెందిన శెట్టి కరుణాకర్‌గౌడ్ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆపరేషన్‌కు రూ.3 లక్షల వరకు ఖర్చయింది. అతడి కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందుల విషయం తెలుసుకొని భరోసా ఫౌండేషన్ తరఫున వారికి రూ. 20 వేల విలువైన సరుకులు అందజేశారు.

మొక్కజొన్న పంటను ధ్వంసం చేసిన అడవి పందులు

అక్కన్నపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సేవాలాల్‌మహారాజ్‌తండా గ్రామపంచాయతీ పరిధిలోని బంగారులొద్ది తండాలో బానోతు భాస్కర్ నాయక్ అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంటను అడవి పందులు ధ్వంసం చేశాయి. దీంతో సోమవారం సాయంత్రం వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలత నష్టపోయిన పంటను పరిశీలించారు. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు ఏఈవో శ్రీలత తెలిపారు.

ఇంటింటికి మట్టిగణపతుల పంపిణీ

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ, బాష సాంస్కృతిక విభాగం, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఇంటింటికీ తిరిగి మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. పట్టణంలోని సీతారాంనగర్, లెక్చరర్స్ కాలనీలలో ఇంటింటికీ మట్టి గణపతులను అందజేశారు. 'మట్టి గణపతిని తయారుచేద్దాం - పర్యావరణాన్ని కాపాడుకుందాం' అని వీధుల వెంట నినదిస్తూ, అవసరమైన వారికి మట్టి గణేశులను అందజేశారు.

మట్టి ప్రతిమల తయారీపై అవగాహన

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితిని పురస్కరించుకొని సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పర్యావరణహిత మట్టి గణపతుల తయారీపై అవగాహన కల్పించారు. రసాయనాలతో కూడిన వినాయకులను వాడవద్దనే సందేశాన్ని విద్యార్థుల్లోకి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని కళాశాల ప్రిన్సిపాల్ విజయగిరి భిక్షపతి తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో 2వేల మట్టి విగ్రహాలు పంపిణీ

గజ్వేల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మట్టి విగ్రహాలను వినియోగించి... పర్యావరణాన్ని పరిరక్షిద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని ప్రధాన రోడ్డులో బీజేపీ నాయకులు, టెలికాం బోర్డు సభ్యుడు కమ్మరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెండు వేల మట్టి విగ్రహాలతో పాటు వ్రతకల్ప పుస్తకరం, పసుపు, కుంకుమను పంపిణీ చేశారు. వారితో మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, నాయకులు తదితరులున్నారు.

ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో...

చేర్యాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణ పరిరక్షణకుపాటు పడదామని ఆర్యవైశ్య మహాసభ చేర్యాల పట్టణాధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వైశ్య భవన్‌లో సుమారు 500మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

కొమురవెల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):కొమురవెల్లి మండలకేంద్రంలోని ప్రధాన రహదారి అంతా గుంతలమయంగా మారినా పట్టించుకునే నాథుడే లేడనీ సీపీఎం నాయకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మల్లన్న దర్శనానికి నిత్యం వందల మంది ఈ దారి గుండానే వస్తుంటారనీ అయినా ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు గురించి పట్టించుకోకపోవమేంటని ప్రశ్నించారు. వెంటనే గుంతలను పూడ్చేలా చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు.

రేషన్ డీలర్ల కమీషన్‌ను ఇవ్వాలి

మద్దూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డీలర్లకు రావల్సిన ఐదు మాసాల కమీషన్ ప్రభుత్వం వెంటనే అందించాలని కోరుతూ తహసీల్ కార్యాలయ అధికారులకు సోమవారం మద్దూరు మండల రేషన్‌డీలర్లు వినతి పత్రాన్ని అందించారు. ఈ విషయమై రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు ఎండీ కరీముద్దీన్ మాట్లాడారు. ప్రభుత్వ ఉత్తర్వుల కనుగుణంగా డీలర్లకు ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు సంబంధిదించి కమీషన్ రావల్సి ఉందన్నారు. కమీషన్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. కమీషన్ రాకుండా పోవడంతో డీలర్లు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డీలర్లకు ఇచ్చే కమీషన్ వేర్వేరుగా కాకుండా పాత పద్ధతి ప్రకారంగా అందించాలని డిమాండ్ చేశారు.

రైతుబజార్ నిర్వహణ ఎవరికీ పట్టదా?

- చేర్యాల రైతుబజార్‌కు వెళ్తే వ్యర్థాల డంప్‌తో స్వాగతం
- ఆరుబయట మెట్ల ఆవరణలో కుళ్లిన కూరగాయల పారబోత
- కంపు కొడుతున్న పరిసరాలు.. దోమల స్వైరవిహారం
- కనీసం డస్ట్‌బిన్‌లు కూడా లేని దయనీయ స్థితి



రైతుబజారు భవనం మెట్లపై కుళ్లిన కూరగాయల వ్యర్థాలు

చేర్యాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కూరగాయల కోసం చేర్యాల పట్టణంలోని రైతుబజారుకు వెళ్తే కుళ్లిన కూరగాయల వ్యర్థాల డంప్ స్వాగతం పలుకుతుంది. మునిసిపల్, వ్యవసాయ మార్కెట్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పరిసరాలు కంపు కొడుతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. ఆదాయం లేదని మార్కెట్ అధికారులు, తమ బాధ్యత కాదన్నట్టుగా మునిసిపల్ అధికారులు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధికారుల నిర్లక్ష్యం..

గతంలో కూరగాయల విక్రయాల కోసం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షాపింగ్ కాంప్లెక్స్‌ను కూల్చివేశారు. దీంతో ఆయా వ్యాపారులను రైతుబజారులో విక్రయించుకునేలా తాత్కాలికంగా ఆశ్రయం కల్పించారు. కానీ తమకెలాంటి ఆదాయం రావడం లేదని మార్కెట్ అధికారులు, రైతుబజారు నిర్వహణతో తమకేం సంబంధమని మునిసిపల్ అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు.

వర్షాకాలం.. దోమలకు ఆవాసం..

యథేచ్ఛగా వ్యర్థాల డంప్‌తో భవనం ఆవరణ దెబ్బతింటున్నా మార్కెటింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. కొంతకాలంగా వర్షాలు కురుస్తుండటంతో క్రమంలో రైతుబజారు ఆవరణలోని కుళ్లిన కూరగాయల వ్యర్థాలు దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. మున్సిపల్ అధికారులు, మార్కెటింగ్ అధికారుల తీరుతో రైతుబజార్‌కు వెళ్లాలంటేనే జంకే దుస్థితి తీసుకురావడం పట్ల స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిపక్కనే ఉండటంతో అటుగా వెళ్లే వాహనదారుల సైతం రైతుబజార్ దుస్థితిపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మార్కెట్, మునిసిపల్ అధికారులు నిర్లక్ష్యం వీడి డస్ట్‌బిన్స్ ఏర్పాటుచేసి రైతుబజారు ఆవరణను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యర్థాల కంపుతో ఉక్కిరిబిక్కిరి

రైతుబజార్‌లో డస్ట్‌బిన్ సైతం ఏర్పాటుచేయకపోవడంతో రోజువారీగా కుళ్లిపోతున్న కూరగాయల వ్యర్థాలను ఆరుబయట మెట్ల ఆవరణలో ఇష్టానుసారం పారబోస్తున్నారు. దీంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. అంతేకాకుండా రైతుబజారు ఆవరణ అంతా వ్యర్థాల వాసన గుప్పుమనడంతో కొనుగోలుదారులు వచ్చేందుకే జంకే పరిస్థితులు నెలకొన్నాయి. ఇక రోజంతా అక్కడే విక్రయదారుల పరిస్థితి వేరే చెప్పనవసరం లేదు. మునిసిపాలిటీలో డస్ట్‌బిన్‌లు అందుబాటులోఉన్నప్పటికీ రైతుబజారు ఆవరణలో నెలకొల్పడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

టీపీసీసీ చీఫ్ అనుచిత వ్యాఖ్యలపై బీజేపీ ధర్నా



హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రి బండిసంజయ్‌పై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం రాస్తారోకో చేశారు. మహేశ్‌కుమార్‌గౌడ్ దిష్టిబొమ్మను దహనం చేయబోగా పోలీసులు అడ్డుకున్నారు. దొంగ ఓట్లతో గెలిచాడని బండి సంజయ్‌పై ఆరోపణలు చేయడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. ఈ వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బండి సంజయ్‌కి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు భూక్య సంపత్‌నాయక్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని సతీష్, నాయకులు తదితరులున్నారు.

కరీంనగర్ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి

అక్కన్నపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి కరీంనగర్ పార్లమెంటు పరిధిలోని ప్రజలను అవమానించిన పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని బీజేపీ మండల అధ్యక్షులు రామంచ మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం అక్కన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన బండి సంజయ్ పై వ్యక్తిగత విమర్శలు చేసిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు తరిమి కొడతారని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ జనగామ వేణుగోపాలరావు, నాయకులు తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబీకులకు మాజీ మంత్రి పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

చిన్నకోడూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మేనల్లుడు చిన్నకోడూరుకు చెందిన జంగపల్లి మణివర్మ (25) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సోమవారం చిన్నకోడూరులో యువకుడి అంత్యక్రియల్లో పాల్గొని, మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతిపట్ల సంతాపం వ్యక్తం చేసి, యువకుడి తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

రామయ్య మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

గజ్వేల్ రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సీనియర్ కాంగ్రెస్ నేత, తుమ్మ రామయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ మండలం దాచారంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుమారులు తుమ్మ కనకయ్య, తుమ్మ శ్రీనివాస్‌లను ఓదార్చారు. పార్టీ అభివృద్ధికి రామయ్య అందించిన సేవలను గుర్తు చేశారు. అలాగే రామయ్య అంతిమ యాత్రలో నర్సారెడ్డి పాల్గొన్నారు. వారి వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సర్దార్‌ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొనగారి రాజు, మండల పార్టీ బాధ్యుడు సుకేందర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

సమస్యలుంటే ఫోన్ చేయండి: కమిషనర్

చేర్యాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మునిసిపల్ పరిధిలో తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణతో పాటు ఇంటిపన్ను తదితర విషయాల్లో సమస్యలుంటే సంబంధిత విభాగాల అధికారులకు ఫోన్‌చేసి సంప్రదించాలని మునిసిపల్ కమీషనర్ నాగేందర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంచినీరు, వీధిదీపాల సమస్యకోసం మున్సిపల్ ఇంజనీర్ వి.శ్రీనాథ్ సెల్ నెం.9398881464, పారిశుధ్య సమస్య నిమిత్తం ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ సెల్‌నెం.9676201012,7989100670, ఇంటిపన్ను, ఆస్తిమార్పిడి విషయాల కోసం మేనేజర్ జె.ప్రభాకర్ సెల్ నెం.9676249957కు కాల్‌చేసి సంప్రదించాలని సూచించారు.

ప్రతాప్‌రెడ్డివి అన్నీ అసత్య ఆరోపణలే

- మల్లన్నసాగర్ భూనిర్వాసితులు

గజ్వేల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ ముంపు గ్రామమైన ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ దామరంచ ప్రతాప్‌రెడ్డివి అన్ని అసత్య ఆరోపణలేనని మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామంలో భూనిర్వాసితుడు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ తనకు 2023లో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు 162నెంబర్ గల ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారని, సదరు ఇంటిని అధికారులు అన్యాయంగా ఖాళీ చేయించారని మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి అంటున్నారని, నా ఇంటిని నేను తీసుకోవడం అన్యాయం ఎలా అవుతుందని ప్రశ్నించారు. మరో నిర్వాసితుడు ఉమ్మారెడ్డి మాట్లాడుతూ తనకు 2013 చట్టం ప్రకారం పరిహారం కావాలని కోరగా, తనకు సంబంధించిన నాలుగు ఎకరాల భూమిని అన్యాయంగా అరికెల చంద్రం, భాస్కర్, స్వామి కాజేశారని, ఈ తతంగం అంతా ప్రతాప్‌రెడ్డి కనుసన్నల్లోనే జరిగిందన్నారు. మరి కొంత మంది మాట్లాడుతూ.. తమకు వచ్చిన ప్లాట్లను తక్కువ ధరకు హద్దులు చూపెట్టకుండా కొనుగోలు చేశారని, తన ఇంటి చుట్టూ ఎకరం భూమి చేసుకున్నారని, ఇతర గ్రామాల్లోని తన కుటుంబ సభ్యులకు, తన బంధువులకు వచ్చే ప్లాట్లను సైతం తన ఇంటి వద్దనే ఏటిగడ్డకిష్టాపూర్‌లోనే తీసుకున్నారని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో టీఎల్ఎం మేళా





రాయపోల్ ఉన్నత పాఠశాలలో మేళాను పరిశీలిస్తున్న అధికారులు, మర్కుక్‌లోని మేళాలో ప్రథమ బహుమతి పొందిన అంగడికిష్టాపూర్ ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాన్ని ఇస్తున్న ఎంఈవో

రాయపోల్/మర్కుక్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మర్కుక్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ మేళాను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులు తమ పాఠశాలలో విద్యార్థులకు బోధన అభ్యసన ప్రక్రియలో ఉపయోగించే ఉపకరణాలను ప్రదర్శించారు. రాయపోల్ జడ్పీ పాఠశాలలో మేళాను తహసీల్దార్ కృష్ణమోహన్ ప్రారంభించారు. అనంతరం జిల్లా సెక్టోరియల్ అధికారి రమేష్ సందర్శించి మేళాలో ప్రదర్శించిన మెటీరియల్ పరిశీలించారు. కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా వర్గల్ మండలానికి చెందిన రాజనరేందర్‌రెడ్డి, ప్రశాంత్, జైపాల్‌రెడ్డి వ్యవహరించారు. ఎంపికైన ఉపాధ్యాయుల ప్రదర్శనలను జిల్లా స్థాయికి పంపించనున్నట్టు ఎంఈవో సత్యనారాయణరెడ్డి తెలిపారు. మర్కుక్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో వెంకటరాములు, సెక్టోరియల్ అధికారి రమేష్, ఎస్ఐ దామోదర్, రిసోర్స్ పర్సన్ ఓంకార్ రాధాకృష్ణలు, హెచ్ఎంలు వెంకటేశం, శంకర్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలుచోట్ల ఘనంగా బీపీ మండల్ జయంతి





సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో, హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

సిద్దిపేటక్రైం/హుస్నాబాద్ టౌన్ ఆగస్ట్ 25 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన బ్రిందెశ్వర్ ప్రసాద్ మండల్ 107వ జయంతిని వివిధ బీసీ కుల సంఘాల ప్రజాసంఘాల నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ సామాజిక ఉద్యమ నాయకులు పోచబోయిన శ్రీహరి యాదవ్ మాట్లాడుతూ బీపీ మండల్ 107 వ జయంతిని సామాజిక న్యాయ సాధన దినంగా పాటిస్తూ బీసీ రిజర్వేషన్ల పోరాటాలను మరింత ఉధృతం చేయడానికి స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. బీసీ కమిషన్ 40సిఫారసులను అమలు చేసే విధంగా ఐకమత్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు బీపీ మండల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 42 శాతం రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే అమోదించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, నియోజకవర్గ జేఏసీ కో ఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్, ఓంఖయూ జేఏసీ వైస్ చైర్మన్ గంపల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి: ఏసీపీ



మాట్లాడుతున్న సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి

సిద్దిపేట క్రైం ఆగస్ట్ 25(ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగల నేపథ్యంలో ఆయన సోమవారం హిందూ, ముస్లిం మతాల పెద్దలతో సిద్దిపేట ఎన్జీవో భవన్‌లో పీస్‌కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కుల, మత బేధాలు లేకుండా అందరూ కలిసిమెలిసి ఉండడం ముఖ్యమని తెలిపారు. అన్ని మసీద్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏదైనా సంఘటన జరిగితే మత పెద్దలు, కుల పెద్దలు ముందుకు వచ్చి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా, ఇతర మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎవరైనా పోస్టులు చేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ సమస్య ఉన్న డయల్ 100 కు కాల్ చేయాలని సూచించారు. సమావేశంలో సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్, మత పెద్దలు, యువకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వచ్చిరాని వైద్యంతో పరేషాన్!

(5వ పేజీ తరువాయి)

ఆర్ఎంపీల వైద్యశాలలు తిరిగి ప్రారంభమయ్యాయి.

పెద్దాసుపత్రులతో కుమ్మక్కు..

గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్ఎంపీలు పట్టణాల్లోని ప్రైవేట్ ఆసుపత్రులతో కుమక్కై 30 నుంచి 40 శాతం వరకు కమిషన్లు పొందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తమ వద్దకు వచ్చిన పేషంట్లను ప్రైవేట్ ఆసుపత్రులకు సిఫారసు చేస్తున్నారు. సదరు ఆసుపత్రుల్లో నామమాత్రపు వైద్యం అందించి రూ.లక్షల్లో బిల్లులు వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆర్ఎంపీలు సదరు ఆసుపత్రి యాజమాన్యాలతో మాట్లాడి బిల్లును తగ్గిస్తున్నామని చెబుతూ రూ.20వేల వైద్యానికి రూ.లక్ష వేసి చివరకు రూ.20 తగ్గించి రూ.80వేలు వసూలు చేస్తున్నారు. సదరు పేషంట్ ఇంటికి బాట పట్టగానే ఆసుపత్రి, ఆర్ఎంపీ తమ కమిషన్లను పంచుకుంటున్నారు. పలువురు ఆర్ఎంపీలు గజ్వేల్, సిద్దిపేట, హుస్నాబాద్ ప్రాంతాల్లో మల్టీస్పెషాలిటీ ఆసుపత్రుల పేరిట వైద్యశాలలు ఏర్పాటు చేసి పలువురు ఎంబీబీఎస్ డాక్టర్లతో ఒప్పందం చేసుకుని వారి పేర్లను వాడుకుని ఆర్ఎంపీలే వైద్యాన్ని అందిస్తున్నారు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని ప్రజలకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అవగాహన కల్పించాలి. స్టెరాయిడ్స్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన ప్రతి విషయాన్ని గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి చైతన్య పరచాలి.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 26 మందికి జరిమానా.. నలుగురికి జైలు

సిద్దిపేట క్రైం ఆగస్ట్ 25(ఆంధ్రజ్యోతి): సిద్ధిపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 26 మంది పట్టుబడ్డారు. వారిని సోమవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట కోర్టులో హాజరుపరచగా విచారణ అనంతరం నిందితులకు రూ.45,500 జరిమానా విధించారు. వారిలో నలుగురికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

పదోన్నతులు బాధ్యతను పెంచుతాయి: సీపీ అనురాధ



పదోన్నతి పొందినవారితో సీపీ డాక్టర్ బి.అనురాధ

సిద్దిపేట క్రైం ఆగస్ట్ 25(ఆంధ్రజ్యోతి): పోలీసులకు పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని సీపీ బి.అనురాధ పేర్కొన్నారు. జిల్లాలో ఏఎస్ఐ నుంచి ఎస్ఐగా ప్రమోషన్ పొందిన ఏ.అంజయ్య, కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్ ప్రమోషన్ పొందిన జి.వెంకన్నను కమిషనర్ కార్యాలయంలో సీపీ అభినందించారు. ఈ సందర్భంగా పదోన్నతులు పొందిన అధికారులు సీపీకి పుష్పగుచ్ఛాన్ని అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. పదోన్నతుల స్ఫూర్తితో పోలీస్ సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలందించాలన్నారు.

జిల్లాలో జాతీయ క్రీడాదినోత్సవ కార్యక్రమాలు

- డీవైఎస్‌వో వెంకట నర్సయ్య



సిద్దిపేట కల్చరల్, ఆగస్ట్ 25 (ఆంధ్రజ్యోతి): ఈనెల 29న నిర్వహించనున్న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడలు యువజన అధికారి జంగాపల్లి వెంకట నరసయ్య తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆదేశానుసారం ఈ నెల 26న పారా అథ్లెట్లకు వాకింగ్ పోటీలు, 27న వినాయక చవితిని పురస్కరించుకొని వినాయక మండపాల్లో రిక్రియేషన్ గేమ్స్, ఫన్నీ గేమ్స్ నిర్వహణ, 28న అన్ని విద్యాసంస్థలు ప్రభుత్వ ప్రైవేటు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంక్షేమ విద్యాసంస్థల్లో క్రీడలకు సంబంధించిన డిబేట్, 29న మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని అందరికీ పరుగు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ధ్యాన్ చంద్ జయంతి నిర్వహించడంతోపాటు విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు ఆయన చెప్పారు. ఈ క్రీడా దినోత్సవ వేడుకలను జిల్లాలోని అన్ని క్రీడా సంఘాల బాధ్యులు, పీఈటీలు, క్రీడాకారులు, క్రీడాభిమాను లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జాతీయస్థాయి కరాటేలో దుబ్బాక విద్యార్థుల ప్రతిభ

దుబ్బాక,ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో ఉన్న బొమ్మక్ శంకరయ్య కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో దుబ్బాక విద్యార్థులు ఘనవిజయం సాధించారు. సుమారు 1500 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో దుబ్బాక పట్టణానికి చెందిన యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ విద్యార్థి వేముల హర్షవర్ధన్ గోల్డ్ మెడల్ సాధించారు. ఆ విద్యార్థికి కరాటేలో శిక్షణనిచ్చిన మాస్టర్ బురాని శ్రీకాంత్ రేంజుకి షోటోకన్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఇండియా వారు అభినందించారు. మాస్టర్ బురాని శ్రీకాంత్‌కు బెస్ట్ కోచ్ అవార్డుతో పాటు మాస్టర్ మెమెంటోను

జిల్లా అథ్లెటిక్ పోటీల్లో హుస్నాబాద్ విద్యార్థి ..



రిశ్వంత్

హుస్నాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట డిగ్రీ కాలేజీ మైదానంలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ ఎంపిక పోటీల్లో హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి గౌరవేని రిశ్వంత్ 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించాడని పాఠశాల పీడీ శ్రీనివాస్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థి రిశ్వంత్‌ను హెచ్ఎం వాసుదేవరెడ్డి అభినందించారు.

గ్రేటర్ వైశ్య బిజినెస్ లీడర్స్ సిద్దిపేట చాప్టర్ చైర్మన్‌గా మాంకాల నవీన్ కుమార్



ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్‌లు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వైశ్య బిజినెస్ లీడర్స్ సిద్దిపేట చాప్టర్ చైర్మన్‌గా డా.మాంకాల నవీన్ కుమార్, వైస్‌చైర్మన్ ఆపరేషన్‌గా గరిపల్లి లక్ష్మణ్ కుమార్, వైస్ చైర్మన్ ఫైనాన్స్‌గా తిప్పరాజు రంజిత్ కుమార్‌లు జీవీబీఎల్ ఫౌండర్‌లతో సీఈవో మంచి రాజశేఖర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మిగితా సభ్యులు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా జీవీబీ ఎల్ ఫౌండర్, సీఈవో మంచి రాజశేఖర్ మాట్లాడుతూ.. జీవీబీఎల్ ద్వారా క్రమశిక్షణతో కూడిన వ్యాపార అభివృద్ధి జరుగుతుందని, దీని ద్వారా కొంత మందికి ఉపాధి కూడా లభిస్తుందన్నారు. సభ్యుల వ్యాపార అభివృద్ధి కొరకు కావలసిన శిక్షణ శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

నాచగిరి క్షేత్రంలో టాయిలెట్ల నిర్మాణానికి శంకుస్థాపన

వర్గల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా ఉండేవిధంగా తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్‌గుప్తా పేర్కొన్నారు. సోమవారం క్షేత్రం వద్ద భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు ఇచ్చే ఎస్‌బీఎం నిధుల నుంచి రూ.3 లక్షల వ్యయంతో ఆలయ సమీపంలో టాయిలెట్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాచగిరి వద్ద మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఆలయ అభివృద్ధి కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ధర్మకర్తల మండలి సభ్యుల సహకారంతో ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మచ్చేందర్, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సమస్యల నిలయంగా తెలంగాణ మోడల్ స్కూల్



ఇర్కోడు మోడల్ స్కూల్ ఎదుట విద్యార్థులు,ఏబీవీపీ నాయకుల నిరసన

సిద్దిపేట రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మోడల్ స్కూల్ హాస్టల్ సమస్యల నిలయంగా మారిందని ఏబీవీపీ హాస్టల్స్ ప్రాంత కన్వీనర్ వేల్పుల రాజ్ కుమార్ విమర్శించారు. సోమవారం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు మోడల్ స్కూల్ హాస్టల్ ఎదుట విద్యార్థినులతో కలిసి ఏబీవీపీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ హాస్టల్ సమస్యలను కేర్ టేకర్ దృష్టికి తీసుకువస్తే వ్యక్తి గతంగా దూషిస్తుందని, పురుగుల అన్నం పెడుతూ బూతులు తిడుతుందనే విద్యార్థులు ఆరోపించినట్లు తెలిపారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి కేర్ టేకర్‌ను, ఏఎన్ఎంను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటానని ఎంఈవో హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి పరశురాం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.